సాక్షి వనపర్తి

ఆదివారం : 17 : నవంబర్ : 2024



భక్తజనసంద్రం

బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం కురుమూర్తి గిరులు జనసంద్రంగా మారాయి.

వివరాలు 8లో ▸



కోచ్‌ల కొరత..

ఉమ్మడి జిల్లాలో కోచ్‌ల కొరతతో ఔత్సాహిక క్రీడాకారులు క్రీడలకు దూరమవుతున్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.1 /20.6

రాత్రి వేళల్లో చలి తీవ్రత పెరుగుతుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. చల్లటి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

వనపర్తి విద్యావిభాగం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లాకేంద్రంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా.. జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జి.గోవర్ధన్‌సాగర్ ప్రారంభించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ శ్రీనివాసులు, తేజకుమార్, వెంకటేశ్వరమ్మ, చైతన్య, చెన్నయ్య, ఇక్బాల్, ఉపాధ్యాయులు ఎండీ రుక్మోద్దీన్, రంగన్న, శ్రీకాంత్, నరేశ్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు జిల్లా క్రీడాకారిణి



వనపర్తిటౌన్: త్వరలో జరిగే జాతీయస్థాయి హాకీ పోటీలకు తెలంగాణ జట్టు తరఫున ఆడేందుకు వనపర్తి బాలికల ఉన్నత పాఠశాల క్రీడాకారిణి అప్సాజెబిన్ ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి శనివారం తెలిపారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–17 బాలికల విభాగంలో ఉమ్మడి జిల్లా జట్టు తరఫున ఆడి ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రధానోపాధ్యాయురాలు, పీడీ శ్రీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

‘మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి’



వనపర్తి రూరల్: జనగణన, నియోజకవర్గాల పునర్విభజన షరతులను తొలగించి చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు 33 శాతం వెంటనే అమలు చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు సృజన డిమాండ్ చేశారు. శనివారం జిల్లాకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి గీత ఆధ్వర్యంలో జరిగిన జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 9 ఏళ్లపాటు మహిళా రిజర్వేషన్ల గురించి పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం.. ఎన్నికల ముందు ఓట్ల కోసం 2023, సెప్టెంబర్ 10న చట్టసభల్లో బిల్లు ఆమోదించిందన్నారు. ఈ బిల్లును దేశంలో జనగణన, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం అమలు చేయాలని షరతు విధించిందని.. వెంటనే తొలగించి రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అమలు చేయాలని కోరారు. మహిళలకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నెరవేర్చాలన్నారు. 33 శాతం మహిళా రిజర్వేషన్‌లో కొన్ని అత్యవసర మార్పులు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో 23వ తేదీన హైదరాబాద్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని.. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మహిళా అధ్యక్షురాలు కళావతమ్మ, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, పట్టణ కార్యదర్శి రమేశ్, ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, జయమ్మ, సునీత, భూమిక, శిరీష తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–3కి సర్వం సిద్ధం

పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

- కేంద్రాలను పరిశీలించిన అధికారులు
- జిల్లావ్యాప్తంగా 31 పరీక్ష కేంద్రాలు

వనపర్తి: జిల్లాకేంద్రంతో పాటు కొత్తకోట, గోపాల్‌పేటలో ఆది, సోమవారం గ్రూప్–3 పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలను పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు శనివారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, పరీక్షల నోడల్ అధికారి సంచిత్ గంగ్వార్ పరీక్ష కేంద్రాల ప్రత్యేక అధికారులు, రూట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఇతర సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు.

హాజరుకానున్న 8,312 మంది విద్యార్థులు..

రెండ్రోజుల పాటు జరిగే గ్రూప్–3 పరీక్షల నిర్వహణకు వనపర్తిలో 24, కొత్తకోటలో 6, గోపాల్‌పేటలో ఒక కేంద్రం మొత్తం 31 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 8,312 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో పురుషులు 4,523, మహిళలు 3,789 మంది ఉండగా.. పరీక్షల నిర్వహణకు 243 మంది సిబ్బందిని కేటాయించారు. దివ్యాంగుల కోసం జిల్లాకేంద్రంలోని పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రత్యేక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష కేంద్రంలో 32 మంది పరీక్ష రాయనున్నారు.

అరగంట ముందు వరకే..

పరీక్ష ప్రారంభమయ్యే సమయానికి అరగంట ముందు వరకే అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించనున్నారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా 8.30 నుంచి 9.30 వరకే అనుమతిస్తారు. మధ్యాహ్నం పరీక్షకు 2.30 వరకే పరీక్షా కేంద్రంలోకి అనుమతించనున్నారు. అభ్యర్థులు గమనించి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని నోడల్ అధికారి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. ఆయా మండలాల అధికారులు శనివారం పరీక్షా కేంద్రాలను పరిశీలించి మౌలిక వసతులు కల్పించారు.

సీసీ కెమెరాల నిఘాలో..

ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి అభ్యర్థితో బయోమెట్రిక్ హాజరు తీసుకునేలా ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులు కేంద్రంలోకి హాల్ టికెట్‌తో పాటు పెన్ను, ఏదైనా గుర్తింపుకార్డు తీసుకెళ్లాల్సి ఉంటుంది. మరే ఇతర వస్తువులను అనుమతించరు. పరీక్ష జరుగుతున్న సమయంలో ఆయా ప్రాంతాల్లోని జిరాక్స్ కేంద్రాలను మూసి ఉంచేలా ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు పోలీసు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

కేటగిరీల వారీగా అధికారులు..

డిపార్ట్‌మెంట్ అధికారులు 31 (మరో ఐదుగురు రిజర్వ్)	అబ్జర్వర్లు 31
	ఫ్లయింగ్ స్క్వాడ్లు 8
జాయింట్ రూట్ అధికారులు 8	రూట్ అధికారులు 7
ఐడెంటిఫికేషన్ అధికారులు 110	పీడబ్ల్యూ స్క్రైబ్స్ 43

నిబంధనలు పాటించాలి..

అభ్యర్థులు తెలంగాణా పబ్లిక్ సర్వీస్ కమిషన్ రూపొందించిన నిబంధనలు కచ్చితంగా పాటించాలి. ఈ నిబంధనలకు లోబడే పరీక్షల నిర్వహణ ఉంటుంది. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– రాంనరేష్, గ్రూప్–3 పరీక్షల కో–ఆర్డినేటర్



పరీక్షల నిర్వహణపై అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, కో–ఆర్డినేటర్ రాంనరేష్

పటిష్ట బందోబస్తు : ఎస్పీ

గ్రూప్–3 పరీక్షల నిర్వహణకు పటిష్ట బందోబస్తు కల్పిస్తున్నట్లు ఎస్పీ రావుల గిరిధర్ శనివారం తెలిపారు. జిల్లాలో 31 పరీక్ష కేంద్రాలుండగా.. 200 మంది సిబ్బందిని బందోబస్తుకు కేటాయించామన్నారు. నిబంధనల ప్రకారం అరగంట ముందే కేంద్రాల గేట్లు మూసివేయనున్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, మంటలను ప్రేరేపించే వస్తువులు, ఇంకు బాటిల్స్ తదితర వస్తువులను కేంద్రంలోకి తీసుకురావద్దని సూచించారు. మహిళా అభ్యర్థులను మహిళా సిబ్బందితో తనిఖీలు చేయిస్తామన్నారు. జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ సమస్యల తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి.. సమావేశానికి హాజరైన అధికారులు

- డిసెంబర్ 1 నుంచి ప్రత్యేక తరగతులు
- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: జిల్లాలోని కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న ఏ ఒక్క విద్యార్థి పది, ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ కాకుండా డిసెంబర్ 1 నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలు, బెస్ట్ అవైలబుల్ పాఠశాలల ప్రత్యేక అధికారులు, ప్రిన్సిపాల్స్‌తో సమీక్ష నిర్వహించారు. గతేడాది 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో సాధించిన ఉత్తీర్ణత వివరాలను పరిశీలించారు. విద్యార్థులు ఏయే సబ్జెక్టులో ఫెయిల్ అయ్యారు.. అందుకుగల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది ఏ ఒక్క విద్యార్థి ఫెయిల్ కాకుండా చూడాలని.. డిసెంబర్ 1 నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. అదే సమయంలో చురుగ్గా ఉన్న విద్యార్థులను గుర్తించి జాబితా తయారుచేసి ఐఐటీ, ఎన్ఐటీ, ఉస్మానియా మెడికల్ క్యాంపస్‌లను చూపించి స్ఫూర్తి పొందేందుకు కార్యాచరణ రూపొందించాలని జిల్లా విద్యాధికారిని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో స్ఫూర్తి నింపడానికి వైద్యులు, అడిషనల్ కలెక్టర్, తాను సైతం వచ్చి మాట్లాడతానని.. ప్రతి శుక్రవారం ఒక గంట సమయం కేటాయించాలన్నారు. వార్షిక పరీక్షలు మార్చిలో, వివిధ కళాశాలల్లో చేరికలకు ఏప్రిల్‌లో పోటీ పరీక్షలు ఉంటాయని.. సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా విద్యాధికారి గోవిందరాజులు, జీసీడీఓ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపటి ప్రజావాణి రద్దు..

నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్–3 పరీక్షలు ఉన్నందున సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులందరూ పరీక్షల నిర్వహణలో ఉంటారని.. దీంతో ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని.. ఎవరూ కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలి

- రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

వనపర్తి: జిల్లాలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రతి నిత్యం ఏపీఎంలు, సీఈఓలు తనిఖీ చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లపై ఏపీఎంలు, పీఏసీఎస్ సీఈఓలతో సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా ఇప్పటి వరకు ఎన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి.. ఇంకా ఎన్ని ప్రారంభం కావాల్సి ఉందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యం తేమశాతం తనిఖీ చేయాలని, ఏవైన సమస్యలుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయడం లేదనే ఫిర్యాదులు రావద్దని.. సన్నరకం వరి ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు తేమశాతం కచ్చితంగా 14 లోపే ఉండాలని, అంతకుమించి ఉంటే కొనుగోలు చేయవద్దన్నారు. తూకం, తేమ కొలిచే యంత్రాలు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, క్యాలిబర్ మీటర్లు తదితర పరికరాలు అవసరమైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో డీసీఓ ప్రసాదరావు, పౌరసరఫరాలశాఖ అధికారి కాశీవిశ్వనాథ్, పౌర సరఫరాలశాఖ డీఎం వైపీ రమేశ్, డీఆర్డీఓ ఉమాదేవి, జిల్లా మార్కెటింగ్ అధికారి స్వరణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గస్తీతోనే నేరాల నియంత్రణ : ఎస్పీ



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

గోపాల్‌పేట: గస్తీతోనే నేరాలను అరికట్టవచ్చని.. గస్తీ నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. శనివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులు, పరిసరాలు, రిసెప్షన్, లాకప్, మెస్‌బరాక్, టెక్నికల్ రూంను పరిశీలించారు. పెండింగ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతిని ఎస్ఐ నరేష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. రోజు ఉదయం , సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టాలని, తాగి వాహనం నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. డయల్ 100 ఫిర్యాదులకు వెంటనే స్పందించాలన్నారు. అంతకుముందు పొలికెపాడులో అవయవదానం చేసిన ఆంజనేయులు కుటుంబాన్ని పరామర్శించారు. ఆంజనేయులు అవయవదానం చేసి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆయన వెంట డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

ఆత్మకూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలుకు సాధ్యం కాని హామీలతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందని మహబూబ్‌నగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆరోపించారు. శనివారం మండలంలోని మూలమళ్లలో పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం పాండురంగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత దేశాయి సరళాదేవి, లక్ష్మారెడ్డి స్మారకార్థం ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణాన్ని సందర్శించారు. రూ.80 లక్షల విలువైన స్థలాన్ని క్రీడాప్రాంగణం కోసం దేశాయి పద్మజారెడ్డి ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు. క్రీడా ప్రాంగణం ప్రహరీ నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. మినీ స్టేడియం నిర్మాణానికి రూ.3 కోట్లను విడతల వారీగా ఇచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బస్సు పునరుద్ధరణ, బీటీరోడ్డు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని చెప్పారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే కుటుంబ సర్వే..

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజల దృష్టి మరల్చేందుకే కుటుంబ సర్వే నిర్వహిస్తున్నారని.. గత ప్రభుత్వం ఇదే తరహాలో సర్వే నిర్వహిస్తే తీవ్రస్థాయిలో రేవంత్‌రెడ్డి వ్యతిరేకించారంటూ నాటి వీడియోను చూపించారు. రాష్ట్ర మహిళలకు రూ.2,500 ఇవ్వలేదని.. మహారాష్ట్రాలో రూ.3 వేలు ఇస్తామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని దుయ్యబట్టారు. పంట రుణమాఫీ చేయలేదని, రైతుభరోసా ఇవ్వలేదని, ఇందిరమ్మ ఇళ్లు రాలేదని.. ఇక్కడ లేనిది మహారాష్ట్రాలో ఎలా అమలు చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశాభివృద్ధి పరుగులు పెడుతోందని.. ప్రపంచ దేశాలన్నీ మెచ్చుకుంటున్నాయని అన్నారు. కార్యక్రమంలో దేశాయి పద్మజారెడ్డి, బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు అశ్విన్‌కుమార్, మేర్వ రాజు, అశోక్‌జీ, విష్ణువర్ధన్‌రెడ్డి, క్యామ భాస్కర్, భగవంత్‌రెడ్డి, అనీల్‌గౌడ్, మనోహర్, ఎల్లన్న, అంజి, అశోక్, వెంకట్రాములు, కేశవ్, కబడ్డీ క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పునరావాస సమస్యలు పరిష్కరిస్తాం



పునరావాస కేంద్రంలో పర్యటిస్తున్న ఆర్‌అండ్‌ఆర్ రాష్ట్ర కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శంకరసముద్రం నిర్వాసితులకు కేటాయించిన పునరావాస కేంద్రంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని రాష్ట్ర పునరావాస కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఉమ్మడి జిల్లా భూ సేకరణ ప్రత్యేక కలెక్టర్ మధుసూదన్‌నాయక్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఎం.వెంకటేశ్వర్లుతో కలిసి కానాయపల్లి పునరావాస కేంద్రంలో పర్యటించి గ్రామస్తులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. సెప్టెంబర్‌లో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేల పర్యటనలో తెలుసుకున్న సమస్యలపై సమగ్ర విచారణ చేపట్టడంతో పాటు పదేళ్లలో పనుల పురోగతిని పరిశీలించేందుకు వచ్చామన్నారు. కేంద్రంలోని ప్లాట్లను సమాంతరంగా చేయడంతో పాటు రోడ్లు, విద్యుత్, డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ప్లాటు, రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వాలని గ్రామస్తులు కమిషనర్‌కు విన్నవించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ బదులిచ్చారు. సేకరించిన వివరాల పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు చెప్పారు. కమిషనర్ వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బోయేజ్, పి.కృష్ణారెడ్డి, చర్లపల్లి తాజా మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బీచుపల్లి యాదవ్, గ్రామస్తులు రావుల జితేంద్రనాథ్‌రెడ్డి, భీమన్ననాయుడు, సాయిలు, ధారమోని బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వారి నిలయం.. ఆరోగ్యవనం!

మిద్దె తోటల పెంపకంపై సర్వత్రా ఆసక్తి

- ఆహ్లాదంతో పాటు ఆరోగ్యానికి పెద్దపీట
- సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు
- పూలు, ఔషధ గుణాలున్న మొక్కలు సైతం..
- మహబూబ్‌నగర్‌లో విస్తరిస్తున్న కల్చర్



మెట్టుగడ్డ: తాగేనీటిలో, పీల్చే గాలిలో, తినే ఆహారంలో.. ఎక్కడ చూసినా రాజ్యమేలుతోంది కల్తీ. దీని దెబ్బకు అనారోగ్యం బారిన పడుతోంది మన శాల్తీ. ఉరుకులు, పరుగుల జీవనంలో ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మానవులు సహజ వనరులను అన్వేషిస్తున్నారు. ఆహ్లాదంతో పాటు ఆరోగ్యానికి పెద్దపీట వేసేలా మిద్దె తోటల పెంపకం చేపట్టి ఔరా అనిపిస్తున్నారు. ఇంటిపై ఉన్న స్థలంలో సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండిస్తూ.. ఔషధ గుణాలున్న మొక్కలను పెంచుతూ ఆరోగ్య నిలయాలుగా మార్చుకుంటున్నారు. మిద్దె తోటల పెంపకంపై సర్వత్రా ఆసక్తి కనబరుస్తుండడంతో మహబూబ్‌నగర్ పట్టణంతో పాటు చుట్టుపక్కల ఈ కల్చర్ విస్తరిస్తోంది. సహజ వనరుల వెంట.. మా ఇంటి వంట అని చాటుతూ స్ఫూర్తిగా నిలుస్తున్న పలువురు మిద్దె తోట పెంపకందారులపై ప్రత్యేక కథనం..

ఆయన ఇల్లు.. ఔషధ భాండాగారం

మహబూబ్‌నగర్‌లోని ఏనుగొండ పోచమ్మ కాలనీలో ఉంటున్న సత్యనారాయణ, లత దంపతులు తమ ఇంటి మిద్దెను ఆరోగ్య నిలయంగా మార్చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు అయిన సత్యనారాయణకు చిన్నప్పటి నుంచే గార్డెనింగ్‌పై మక్కువ.సుమారు 150 గజాల స్థలంలో సేంద్రియ పద్ధతిలో బెండ, బీర, దొండ, సొరకాయ వంటి కూరగాయలతో పాటు అన్ని రకాల ఆకు కూరలు సాగు చేస్తున్నారు. డ్రాగన్, సపోట, లిచి ఫ్రూట్, గంగ రేగు వంటి పండ్ల మొక్కలు పెట్టారు. అంతేకాదు కిడ్నీ స్టోన్ తగ్గించడంలో వాడే రణపాల మొక్క, షుగర్‌ను తగ్గించడంలో ఇన్సులిన్‌గా ఉపయోగపడే మొక్క, కంటిచూపు మెరుగు పడేందుకు వాడే మొక్కలను తన మిద్దె తోటలో పండిస్తూ ఔరా అనిపిస్తున్నారు.

చుట్టుపక్కల విస్తరించడం ఆనందంగా ఉంది..



నాకున్న ఆసక్తితో ఇంటిపై తోట తయారు చేసుకోగలిగాను. నా కుటుంబసభ్యులు రసాయనాలు వాడని కూరగాయలు, పండ్లు తినాలనే సంకల్పంతో సుమారు రూ.5 లక్షలు వెచ్చించి ఇంటిపై భాగంలో తోట ఏర్పాటు చేసుకున్నాం. ఈ రోజు నాతో పాటు చుట్టుపక్కల వారు, బంధువులు ఇలాంటి తోటలు ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉంది. ప్రకృతి సేవాదళ్ ఏర్పాటు చేసుకుని ముందుకెళ్తున్నా. – సత్యనారాయణ, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

మధ్యతరగతి కుటుంబాలు సైతం..

మార్కెట్‌లో కూరగాయలు, పండ్ల ధరలు భగ్గుమంటున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ఆ ధరలు వెచ్చించినా ఆరోగ్యకరమైన ఆహారం తినలేకపోవడంతో ఇంటి వద్దే కూరగాయాలు, పండ్ల మొక్కలు పెంచడంపై ప్రజలు దృష్టి పెట్టారు. అయితే పట్టణాల్లో అనువైన స్థలం లేకపోవడంతో మిద్దె తోటల సాగుపై ప్రజలు దృష్టి కేంద్రీకరించారు. తొలుత ఉన్నత వర్గాలు ప్రారంభించగా.. కరోనా ప్రభావం తర్వాత మధ్య తరగతి వర్గాలు సైతం మిద్దె సాగుపై దృష్టి కేంద్రీకరించాయి. ఈ క్రమంలో పట్టణంలోని ఏనుగొండ, సగర కాలనీ, భగీరథ, రాజేంద్రనగర్, హౌసింగ్‌బోర్డు, బీకేరెడ్డి, మర్లు తదితర కాలనీల్లోని పలు ఇళ్లలో మిద్దె తోటల సాగు పెరిగింది.

400 గజాల్లో నందనవనం

మహబూబ్‌నగర్‌లోని పంచముఖి కాలనీలో ఉండే ప్రభుత్వఉద్యోగులు వెంకటేష్‌గౌడ్–భానుకుమారి 2016 నుంచి మిద్దె తోటను ఏర్పాటు చేసుకున్నారు. మా ఇల్లే నందనవనం అనే పేరుతో 400 గజాల్లో సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, పండ్లు పండిస్తున్నారు. పూల మొక్కలు కూడా పెంచుతున్నాం. కిచెన్ వ్యర్థాలు, కోకోపీట్ ఎరువుగా వాడుతున్నారు. ఆరోగ్యమే ప్రధానమని.. ఉన్న స్థలంలో సహజసిద్ధంగా పండించిన కూరగాయలనే ఆహారంగా తీసుకుంటున్నామని ఆ దంపతులు చెబుతున్నారు.

రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

వెల్దండ: రైతుల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం మంత్రి నాగేశ్వర్‌రావు శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకొని తిరిగి హైదరాబాద్ వెళ్తూ.. మార్గమధ్యలో వెల్దండలోని శ్రీవెంకటేశ్వర్ రైస్‌మిల్లు వద్ద కొద్దిసేపు ఆగారు. ఈ క్రమంలో రైస్ మిల్లులో ఆరబెట్టిన వరి ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం విక్రయించుకోవాలన్నారు. తేమశాతం తక్కువగా ఉండేలా ధాన్యాన్ని ఆరబెట్టాలన్నారు. వరిపంటకు ప్రభుత్వ మద్దతు ధరతోపాటు అదనంగా రూ.500 బోనస్ అందిస్తుందన్నారు. కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించడానికి కృషిచేస్తున్నట్లు వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మిల్లు నిర్వాహకులు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలీమ్, నాయకులు లక్ష్మయ్య, రామకృష్ణ, ఆనంద్, కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడు దుర్మరణం


చిన్నమల్లయ్య (ఫైల్)

కోడేరు: ట్రాక్టర్ ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కుర్వ చిన్నమల్లయ్య(75) ప్రధాన రోడ్డు దాటుతుండగా జనుంపల్లి నుంచి కోడేరుకు వెళ్తున్న ట్రాక్టర్ వేగంగా వచ్చి వెనకనుంచి ఢీకొట్టింది. అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోకారి తెలిపారు.

బోరుబండి బోల్తా పడి మరొకరు..

కొత్తకోట రూరల్: బోరు బండి బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ యుగేంధర్‌రెడ్డి కథనం ప్రకారం.. కొత్తకోటకు చెందిన ఓ వ్యక్తి బోరు బండి శనివారం రాత్రి గట్లఖానాపూర్‌లో ఓ రైతు పొలంలో బోరు వేసేందుకు వెళ్తుండగా.. వెల్టూరు శివారులో మలుపు దగ్గర డ్రైవర్ అజాగ్రత్త కారణంగా బోరుబండి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బోరు బండిలో పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముక్కులాల్(43) అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్ లక్ష్మయ్యతోపాటు రాందారి (మృతుడి సోదరుడు), సూరి (వరంగల్) గాయాలయ్యాయి. క్షతగాత్రులను గ్రామస్తులు అంబులెన్స్‌లో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నీటికుంటలో పడి యువకుడు మృతి

జడ్చర్ల: ప్రమాదవశాత్తు ఓ యువకుడు నీటికుంటలో పడి మృతిచెందిన ఘటన శనివారం మండలంలోని కొండేడులో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మంచాల రమేశ్ (18) శుక్రవారం గ్రామ సమీపంలోని ఎర్రగుంటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. శనివారం కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించి అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

అమరచింత: మండలంలోని సింగంపేటకు చెందిన వివాహిత పావని అదృశ్యమైనట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. సింగంపేటకు చెందిన వడ్డె మహేష్, పావని భార్యాభర్తలు. మూడు రోజు ల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో మనస్థాపానికి గురైన పావని ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె కోసం కుటుంబ సభ్యులు గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. భర్త మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డిగ్రీ విద్యార్థిని..

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలో డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైనట్లు ఎస్ ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. జోగుళాంబ గద్వాల జిల్లా నందిమల్లగడ్డకు చెందిన లావణ్య (20) తన తమ్ము డు శ్రీకాంత్‌తో కలిసి వనపర్తిలో అద్దె గదిలో ఉంటూ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనలీయర్ చదువుతుంది. శనివారం కళాశాలకు వెళ్లిన లావణ్య.. తిరిగి అద్దె గదికి వెళ్లలేదు. తన తమ్ముడు వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్టేడియాల్లో కోచ్‌ల కొరత


మహబూబ్‌నగర్‌లోని మెయిన్ స్టేడియం

- ఏళ్ల నుంచి భర్తీ కాని కోచ్‌లు
- నూతన క్రీడాపాలసీపై చిగురిస్తున్న ఆశలు
- శిక్షణకు దూరమవుతున్న ఔత్సాహిక క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఇది మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియం. ఉమ్మడి జిల్లాకే తలకమానికం. ఇంత పెద్ద స్టేడియంలో కోచ్‌ల కొరత ఉంది. గతంలో కోచ్‌లతో కళకళలాడింది. ప్రస్తుతం ఐదుగురు కోచ్‌లతోనే నెట్టుకొస్తున్నారు. 16 ఏళ్ల నుంచి కోచ్‌ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, స్విమ్మింగ్ కోచ్‌లు ఉన్నారు. కేవలం ఐదుగురు మాత్రమే ఉండడం మిగతా క్రీడలకు లేకపోవడంతో ఔత్సాహిక క్రీడాకారులు నిరాశకు గురవుతున్నారు. హాకీ, ఖోఖో, హ్యాండ్‌బాల్‌తోపాటు ఇతర క్రీడలకు కోచ్‌లు అసలే లేరు. కోచ్‌లు లేక ఔత్సాహిక క్రీడాకారులు క్రీడా శిక్షణకు దూరం అవుతున్నారు.

2007 నుంచి శాశ్వత పద్ధతిన..

జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో క్రీడా స్టేడియాలను నిర్వహిస్తున్నారు. కాగా 2007 నుంచి స్టేడియాల్లో శాశ్వత పద్ధతిన కోచ్‌ల నియామకం చేపట్టలేదు. ఇప్పుడు ఉన్న కొంతమంది కోచ్‌లు కూడా తాత్కాలిక పద్ధతిన పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 13 స్టేడియాలు ఉండగా కేవలం ఏడుగురు కోచ్‌లే ఉన్నారు.


మహబూబ్‌నగర్‌లోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం

ఇండోర్ స్టేడియాలది..

జిల్లాలో మహబూబ్‌నగర్ పట్టణంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, ఎంవీఎస్ మైదానంలోని మినీ స్టేడియం, చిన్నచింతకుంట మండలంలోని అల్లీపూర్ గ్రామంలో మినీ స్టేడియం ఉంది. ఎన్నో సౌకర్యాలతో నిర్మించిన ఈ ఇండోర్ స్టేడియాల్లో కనీసం ఒక్క కోచ్ లేకపోవడం గమనార్హం. కోచ్‌లు లేకపోవడంతో ఇండోర్ క్రీడల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు రాణించలేకపోతున్నారు. మహబూబ్‌నగర్‌లోని విశాలమైన అధునాతనమైన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, బాక్సింగ్, జూడో, టేబుల్‌టెన్నిస్ క్రీడలకు కోచ్‌ల నియామకాలైతే ఔత్సాహిక క్రీడాకారులకు మెరుగైన క్రీడా శిక్షణ లభించే అవకాశం ఉంటుంది.

క్రీడల దశ తిరిగేనా.?

రాష్ట్రంలో క్రీడాభివృద్ధి క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం ప్రభుత్వం నూతన పాలసీ (క్రీడా విధానం) తీసుకురానున్నది. దేశంలోనే మెరుగైన క్రీడాపాలసీ తీసుకొచ్చి గ్రామీణస్థాయి నుంచి క్రీడలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. నూతన పాలసీతో కోచ్‌ల నియామకాలపై ఆశలు చిగురిస్తున్నాయి. త్వరలో రానున్న నూతన క్రీడాపాలసీతోనైనా క్రీడల దశ తిరగేనా అని పలువురు సీనియర్ క్రీడాకారులు అభిప్రాయపడుతున్నారు. ప్రతి స్టేడియంలో కోచ్‌లను నియమించి క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇవ్వాలని కోరుతున్నారు.

క్రీడాకారులకు మేలు..



క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది. త్వరలో రానున్న నూతన క్రీడాపాలసీతో ఔత్సాహిక క్రీడాకారులకు ఎంతో మేలు జరగనుంది. స్టేడియాల్లో కోచ్‌ల నియామకం జరిగే అవకాశం ఉంది. క్రీడాశిక్షణతో నైపుణ్యం గల క్రీడాకారులు వెలుగులోకి వస్తారు.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న స్టేడియాల వివరాలు..

- మహబూబ్‌నగర్ జిల్లా యువజన, క్రీడాశాఖ పరిధిలో జిల్లా కేంద్రంలోని స్టేడియం,జడ్చర్ల
- నారాయణపేట జిల్లాలో నారాయణపేట, మక్తల్.
- వనపర్తి జిల్లాలో వనపర్తి పట్టణంలో ఒకటి, మరొకటి గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం, ఆత్మకూర్ స్టేడియం.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో అచ్చంపేట, కల్వకుర్తి (గ్రీన్‌ఫీల్డ్), కొల్లాపూర్ (గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం).
- గద్వాల జిల్లా కేంద్రంలో డీఎస్‌ఏ, మరో గ్రీన్‌ఫీల్డ్, ఇటిక్యాల ఎర్రవల్లి చౌరస్తాలో గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం.
- మహబూబ్‌నగర్‌లోని మెయిన్ స్టేడియంలో ఐదుగురు, వనపర్తి, గద్వాల జిల్లాల్లో ఒక్కరేసి కోచ్‌లు మాత్రమే ఉన్నారు. మిగతా స్టేడియాల్లో ఒక్క కోచ్ కూడా లేకపోవడంతో క్రీడలపై శిక్షణ ఇచ్చేవారే కరువయ్యారు. స్టేడియంలకు కోచ్‌ల నియామకం జరిగితే ఔత్సాహిక క్రీడాకారులకు మెరుగైన శిక్షణతో పాటు క్రీడా సౌకర్యాలు సమకూరే అవకాశాలు ఉన్నాయి.

మోదీ సంక్షేమం కోసమే జమిలి ఎన్నికలు


కౌసల్యమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి తదితరులు

- సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

తెలకపల్లి: దేశంలో ప్రధాని మోదీ సంక్షేమం కోసమే జమిలి ఎన్నికలు అంటున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని గౌరెడ్డిపల్లిలో నిర్వహించిన ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మాడ్గుల పర్వత్‌రెడ్డి మాతృమూర్తి కౌసల్యమ్మ దశదినకర్మలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల తర్వాత ప్రధాని నరేంద్రమోదీ జమిలి ఎన్నికలకు సిద్ధమవుతున్నారని అన్నారు. దేశంలో 29 రాష్ట్రాలు ఉన్నాయని.. జమిలి ఎన్నికలు నిర్వహించడం అసాధ్యమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతూ పరిపాలన కొనసాగిస్తుందన్నారు. జీఎస్టీ ద్వారా అధిక సుంకం వసూలు చేస్తూ.. సెంటిమెంట్ రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రపంచంలోనే మూడవ ధనిక దేశంగా నిలబెడుతానని ప్రధాని మోదీ ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. కేంద్రం సమన్వయకర్త మాత్రమేనని.. ఏ రాష్ట్రం హక్కులు ఆ రాష్ట్రానికి ఉన్నాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల కాలంలో ఏ ఒక్కరికీ ఇళ్లు ఇవ్వలేదని.. రుణమాఫీ సక్రమంగా చేయలేదని.. ఇచ్చిన హామీలు సక్రమంగా అమలు చేయకపోవడంతో గద్దె దించినట్లు ఆయన గుర్తుచేశారు. ప్రజల ఆకాంక్ష మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రైతులకు రూ. 31వేల కోట్ల రుణ మాఫీ చేయాల్సి ఉండగా.. వివిధ కారణాలను చూపి కేవలం రూ. 18కోట్ల రుణాలను మాత్రమే మాఫీ చేసిందన్నారు. రైతులందరి పంట రుణాలను మాఫీ చేయడంతో పాటు అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయకుంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.బాల్‌నర్సింహ, రాష్ట్ర కార్యదర్శి సదానందంగౌడ్, మాజీ కార్యదర్శి కర్ణాకర్‌రెడ్డి, హెచ్.ఆనంద్‌జీ, వార్ల వెంకటయ్య, శంకర్‌గౌడ్, శివశంకర్, ఆంజనేయులు, రవీందర్ పాల్గొన్నారు.

యువకులు ఆదర్శంగా నిలవాలి


మాట్లాడుతున్న రిటైర్డ్ డీఈఓ విజయ్‌కుమార్

- రిటైర్డ్ డీఈఓ విజయ్‌కుమార్

జడ్చర్ల టౌన్: యువకులు పలువురికి ఆదర్శంగా నిలవాలని రిటైర్డ్ డీఈఓ విజయ్‌కుమార్ అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహిస్తున్న వంద రోజుల పాదయాత్రలో భాగంగా శనివారం జడ్చర్లకు చేరుకున్నారు. ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మహాత్మాగాంధీ చరిత్రను తెలుసుకోవాలని, ఆయన పడిన కష్టాలను స్ఫూర్తిగా తీసుకుని ముందడుగు వేయాలన్నారు. విద్యార్థులపై బాధ్యత పెరిగిందన్నారు. పుస్తకాలు చదవటంతో ఎంతోలాభం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు సదాశివయ్య, గోనెల రాధాకృష్ణ, విఠలయ్య, అయ్యన్న, తెలుగు సత్తయ్య, కాల్వరాంరెడ్డి, మేడిశెట్టి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం ఆపండి


ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అలంపూర్: ప్రమాదకర ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరగకుండా చూడాలని రాజోలి మండల రైతులు శనివారం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడిని కోరారు. శనివారం కర్నూలులోని ఎమ్మెల్సీ నివాసంలో వారిని కలిసి సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇథనాల్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే విష వాయువులు, మురుగుతో పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ, నసనూరు, మాన్‌దొడ్డి, చిన్నతాండ్రపాడు, నౌరోజీక్యాంపు, వేణిసోంపురం, కేశవరం, తుమ్మిళ్ల, పచ్చర్ల, తనగల, పెద్దతాండ్రపాడు, రాజోలిలోని పొలాలు బీళ్లుగా మారి రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు అనారోగ్యం బారినపడే ప్రమాదం అధికంగా ఉంటుందని.. ఫ్యాక్టరీ నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజల జీవన విధానం ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

‘భగీరథ’ పైప్‌లైన్ ధ్వంసం

- మూడు మున్సిపాలిటీలు, 105 గ్రామాలకు నిలిచిన నీటి సరఫరా


కొత్తకోట మండలం అమడబాకుల పైప్‌లైన్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది


అమరచింతలో వ్యవసాయ బోరుమోటారు నుంచి నీటిని తెచ్చుకుంటున్న యువకులు

అమరచింత: మిషన్ భగీరథ పథకం నీటి సరఫరాలో అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్దమందడి మండలం బుగ్గపల్లి తండా వద్ద ఉన్న మిషన్ భగీరథ పథకం సంప్ హౌజ్ వద్ద సాంకేతిక సమస్య తలెత్తడంతో పాటు కొత్తకోట మండలం అమడబాకుల వద్ద ప్రధాన పైప్‌లైన్ ధ్వంసమైంది. దీంతో వనపర్తి జిల్లాలోని అమరచింత, ఆత్మకూర్, కొత్తకోట మున్సిపాలిటీలతో పాటు మదనాపురం మండలంలోని 23 గ్రామాలు, కొత్తకోట మండలంలో 34, ఆత్మకూర్ మండలంలో మూడు, అమరచింత మండలంలో 8, పెబ్బేరు మండలంలో 22, శ్రీరంగాపురం మండలంలో రెండు, మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలో 8, కొకుంట్ల మండలంలో ఐదు గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం గ్రామాల్లో చేతిపంపులు లేకపోవడం.. ఉన్న బోరుమోటార్లు, వాటర్ ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని అందించక పోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డిని వివరణ కోరగా.. పైప్‌లైన్ మరమ్మతు పనులు పూర్తి చేశామన్నారు. రెండు రోజుల క్రితం పైప్‌లైన్ లీకేజీ కావడంతో ధ్వంసమైందని, సిబ్బందితో యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఆయా గ్రామాలకు తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

హైకోర్టు మార్గదర్శకాలు బేఖాతరు

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కనిపించని ఫిర్యాదుల పెట్టెలు

జడ్చర్ల టౌన్: అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలని హైకోర్టు మార్గదర్శకాలు జారీ చేసినా అధికారులు బేఖాతరు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని జడ్చర్ల, మహబూబ్‌నగర్, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వీటి జాడే కనిపించడం లేదు. విజిటర్స్ రిజిస్టర్ ఉన్నా.. అది రిజిస్ట్రార్ చాంబర్‌లో ఉంటోంది. సామాన్యులకు అందుబాటులో ఉంచటం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. హైకోర్టు మార్గదర్శకాలు అమలుచేసి ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటుచేస్తే కార్యాలయాల్లో జరిగే అవినీతి వెలుగు చూస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉద్యోగాల పేరుతో మోసం

- నిందితుడు రిమాండ్‌కు..

గద్వాల క్రైం: నిరుద్యోగులకు ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం చేసిన కేసులో నిందితుడిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. జిల్లాకేంద్రంలోని వెంకంపేటకు చెందిన గుర్రం యువరాజు జిల్లా ఆరోగ్యశాఖలో సూపర్‌వైజర్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురు నిరుద్యోగుల నుంచి రూ.3 లక్షలు వసూలు చేశారు. ఆరు నెలలుగా దాట వేస్తుండటంతో మోసపోయామని గుర్తించిన అశోక్, వినోద్ సెప్టెంబర్ 29న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టి శనివారం ఉదయం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గద్వాల కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ వివరించారు. నిందితుడిని మహబూబ్‌నగర్ జిల్లా జైలుకు తరలించమన్నారు.

జూరాల కాల్వలో పేరుకుపోయిన జమ్ము



పెంట్లవెల్లి: మండల పరిధిలోని సింగవరం గ్రామంలో జూరాల కాల్వలో జమ్ము పేరుకుపోయింది. గోపల్‌దిన్నె రిజర్వాయర్ నుంచి సింగవరం కాల్వ ద్వారా గ్రామంలో ఉన్న చెరువుకు నీళ్లు వస్తుంటాయి. ఆ చెరువు నుంచి పంట పొలాలకు నీరును వాడుకుంటారు కాని ఈ కాల్వలో పెద్ద మొత్తంలో జమ్ము పేరుకుపోవడంతో నీరు సరిగా రావడం లేదు. ఇటీవల కాల్వ నుంచి వర్షాలకు ఎక్కువ మొత్తం నీరు పారుతుండడంతో అక్కడే ఉన్న ప్రధాన రహదారి కూడా రెండు నెలల క్రితం పాడవడం జరిగింది. అధికారులు కాస్త స్పందించి ఆ కాల్వలో ఉన్న చెత్తను తొలగించాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

కురుమూర్తి.. భక్తజనసంద్రం


కురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


కోనేరులో స్నానాలు ఆచరిస్తూ..


క్యూలైన్లో బారులుదీరి..


జాతర మైదానంలో రద్దీ

- వైభవంగా కొనసాగుతున్న ఉత్సవాలు


తలనీలాలు సమర్పిస్తూ..

చిన్నచింతకుంట: పాలమూరు ప్రజల ఆరాధ్య దైవమైన కురుమూర్తిస్వామి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రోజువారి కార్యక్రమాలను ఆలయ వేదపండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోనేరులో స్నానాలు ఆచరించిన భక్తులు తడి దుస్తులతో స్వామివారిని దర్శించుకున్నారు. పద్మావతిదేవి, చెన్నకేశవ, ఆంజనేయస్వామి ఆలయాలు, స్వామివారి ఉద్దాల మండపం, వాహన సేవల వద్ద భక్తులు పూజలు చేశారు. జాతర మైదానంలో దాసంగాలు పెట్టి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. కల్యాణ కట్ట వద్ద భక్తులు తలనీలాలు సమర్పించారు. జాతర మైదానంలో గాజులు, స్వీట్లు తదితర వాటిని కొనుగోలు చేశారు. జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వర్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు.